

ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురిలో బతుకమ్మ ఆడుతూ రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మూసీ పరీవాహక ప్రాంతాల మహిళలు

# మా ఇండ్ల జోలికి ఉయ్యాలో.. నువ్వు రావొద్దయ్య ఉయ్యాలో

## వినూత్నంగా మూసీ నిర్వాసితుల బతుకమ్మ పాట

### సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆవేదన

*ఎల్బీనగర్, అక్టోబర్ 3: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు హైడ్రా, సీఎం రేవంత్‌రెడ్డిపై తమ ఆక్రోశాన్ని వివిధ రూపాల్లో వెళ్లగక్కుతున్నారు. చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలోని ప్రజలు అమావాస్యనాడు తమ ఇండ్లను రేవంత్‌రెడ్డి దృష్టి నుంచి కాపాడాలంటూ దిష్టి తీసి నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతున్నారు. ప్రస్తుతం ఈ బతుకమ్మ పాట ఎక్స్ వేదికగా వైరల్ అవుతున్నది.*



బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాలో..
రేవంత్ సారూ ఉయ్యాలో..
నీజాగల నీవుండూ ఉయ్యాలో..
మా ఇంట్ల మమ్మల్ని ఉయ్యాలో..
ఉండనీయ వయ్య ఉయ్యాలో..
మూసీ ప్రక్షాళన ఉయ్యాలో..
ఉన్నదాంట్లో చేయి ఉయ్యాలో..
మాఇండ్ల జోలికి ఉయ్యాలో..
నువ్వు రావొద్దయ్యా ఉయ్యాలో...
ఇకనైనా నీవు ఉయ్యాల్లో..
బుద్ధి తెచ్చుకో ఉయ్యాలో..
నీ పదవి నీకు ఉయ్యాలో..

ఉండదయ్య నీకు ఉయ్యాలో..
ఆడోళ్ల జోలికి ఉయ్యాలో..
నీవు రావొద్దయ్య ఉయ్యాలో..
ఆది పరాశక్తులం ఉయ్యాలో..
అంతమైపోతావు ఉయ్యాలో..
లండన్‌ల తెలిసినది ఉయ్యాలో..
చూసి వచ్చినావా ఉయ్యాలో..
హైదరాబాదులో ఉయ్యాలో..
అది జరుగదయ్య ఉయ్యాలో..
లండన్‌లో పుట్టలేదు ఉయ్యాలో..
నువ్వు లండన్‌లో పెరుగలేదు ఉయ్యాలో..
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం పంచాయతీ కార్యాలయంలో అంటించిన నోటీసుపై కలెక్టర్‌కు విన్నవిస్తున్న శీలం కవిత, ఇతర గ్రామ మహిళలు

# భట్టి ఇలాకాలో బతుకమ్మకు అవమానం

- కాంగ్రెస్ నేతల హుకుంతో బతుకమ్మపై నిషేధం
- పంచాయతీ ఆవరణలో ఆడొద్దంటూ నోటీస్
- కలెక్టర్ ఆదేశించినా బేఖాతరు
- మహిళల అడ్డగింత.. రోడ్డుపైన ఆట
- ఖమ్మం జిల్లా భీమవరంలో ఘటన

ఎర్రుపాలెం, అక్టోబర్ 3: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ప్రజల్లో సమైక్యతను తీసుకొచ్చింది. సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదికగా నిలిచింది. ఊరూరా ఉద్యమ పాటలతో బతుకమ్మ ఆడుతూ నాడు ప్రజలు ఉత్తేజితులయ్యారు. ఊరూవాడా ఏకమై సింగిడి పూలతో పునరుత్తేజితులై ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మకు ప్రపంచ ఖ్యాతినే తీసుకొచ్చారు. రాష్ట్ర పండుగగా గుర్తించి, ప్రత్యేక నిధులు కేటాయించి, ఏటా బతుకమ్మ చీరలు ఇస్తూ మహిళలను బతుకమ్మలుగా కొలిచేలా గుర్తింపుతెచ్చారు. కానీ, నేటి కాంగ్రెస్ సర్కారు బతుకమ్మకే అవమానం కలిగిస్తున్నది. దానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇలాకాలోని బీమవరంలో జరిగిన ఘోర అవమానమే దానికి నిదర్శనం. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం భీమవరంలో బతుకమ్మ ఆడేందుకు కాంగ్రెస్ నేతల హుకుంతో అధికారులు, సిబ్బంది ఆటంకం కల్పించారు. గ్రామంలో బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడి సహకారం, ఎన్‌ఆర్‌ఐల తోడ్పాటుతో గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. దాని ఆవరణలో మహిళలంతా ఏటా బతుకమ్మ పండుగ సంబురాలు జరుపుకుంటారు.

### కాంగ్రెస్ నేతల దుష్టపన్నాగం

బీఆర్‌ఎస్ వర్గీయులు పంచాయతీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుకునేందుకు సిద్ధమైన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు దుష్ట పన్నాగంతో ఎంపీడీవో దారా కార్యదర్శి మురళికి పలు ఆదేశాలు జారీచేయించారు. 'అధికారుల అనుమతి లేకుండా కార్యాలయంలో ఎటువంటి కార్యక్రమాలు, ఉత్సవాలు జరపకూడదు' అంటూ బోర్డులో నోటీసు ఉంచారు. బీఆర్‌ఎస్ మాజీ జడ్పీటీసీ శీలం కవిత, పలువురు గ్రామ మహిళలు దీనిని ప్రశ్నించారు. గురువారం ఖమ్మం వెళ్లి కలెక్టర్‌ను కలవగా, అనుమతించారు. ఈ మేరకు గురువారం రాత్రి స్థానిక మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో అక్కడికి బయలుదేరారు. ఆఫీసు వద్ద ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్‌ను అడ్డుపెట్టి అడ్డుకున్నారు. మధిర సీఐ మధు అక్కడికి చేరుకొని వేరేచోట బతుకమ్మ ఆడుకోవాలని సూచించారు. దీంతో చేసేదేమీలేక గ్రామ మహిళలందరూ రోడ్డుపక్కనే బతుకమ్మ ఆడుకున్నారు.

# కాంగ్రెస్ నోళ్లలో మూసీ మురికి

- పేదల కలల సౌధానికి రూ. 25 వేలా?
- 50 వేలిస్తే మంత్రుల ఇండ్లు కూలుస్తారా?
- సర్కారు ధన దాహానికి బుచ్చమ్మ, కుమారన్న బలి .. కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): పేద, మధ్య తరగతి ప్రజలు పైసాపైసా కూడబెట్టుకొని, బ్యాంకుల నుంచి అప్పు తెచ్చుకొని కట్టుకున్న కలల సౌధం ఖరీదు రూ. 25వేలా? ఇండ్లు ఖాళీ చేస్తే డబుల్ బెడ్రూంతో పాటు పారితోషికం ఇస్తామంటూ వెకిలి ఆఫర్లేంటి? అంటూ గురువారం ఎక్స్ వేదికగా కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు, ఆయన మంత్రుల ఇండ్లకు రూ. 50 వేల చొప్పున ఇస్తే కూల్చుతరా' అని నిలదీశారు. కష్టపడి కట్టుకున్న గూళ్లు రాత్రికిరాత్రే ఎక్కడ కూలుతాయోనని గుండెలు ఆగిపోతున్నా, ఉమ్మడి కుటుంబాలు విడిపోతున్నా ఈ సర్కారు ధన దాహం తీరడంలేదని మండిపడ్డారు. ఇండ్లు పోతాయనే భయంతో ఇప్పటికే ఓ బుచ్చమ్మ, కూమారన్న ప్రాణాలు పోయాయని, నీ స్కాములకు ఇంకా ఎందరి ప్రాణాలు బలి తీసుకుంటావో చెప్పు? అని ప్రశ్నించారు. అయినా మూసీ మురికి నీరంతా కాంగ్రెస్సోళ్ల నోట్లోనే ఉండగా ఇంకా లక్షన్నర కోట్లు వెచ్చించి శుద్ధి ఎందుకు? అని నిలదీశారు.



### మార్పు అంటూ కాంగ్రెస్ మోసం

కాంగ్రెస్ సర్కారు మార్పు..మార్పు అంటూ ప్రజలను మోసం చేస్తున్నదని కేటీఆర్ దుయ్యబట్టారు. పడిపోయిన రాష్ట్ర ఆదాయమే పాలనా వైఫల్యానికి నిదర్శమని పేర్కొన్నారు. తొలి ఏడాదిలోనే ఇట్లుంటే ఇగ నాలుగేండ్లు గడ్డుకాలమేనని తెలిపారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప, దిద్దుబాటు చర్యలు కనుచూపుమేర కనిపించడం లేదని విమర్శించారు. సీఎం అనుభవ రాహిత్యంతోనే ఈ పరిస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన ఘనత ఆయనదేనని ఎద్దేవా చేశారు.

### కేసీఆర్ దార్శనిక ఆలోచనకు నిదర్శనం

వరంగల్‌కు పూర్వవైభవం తెచ్చే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ సర్కారు నెలకొల్పిన టెక్స్‌టైల్ పార్కు కేసీఆర్ దార్శనికతకు నిదర్శమని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్దదైన ఇందులో మొదట కిటెక్స్, ఇప్పుడు దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ నియామకాలు చేపట్టడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఇందులో భాగస్వాములైనందుకు ఎంతో గర్వంగా ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు.

# రెడ్ మార్కింగ్‌లో లక్షన్నర ఇండ్లు?

▸ మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నది. రెవిన్యూ, నీటిపారుదల వంటి పలు శాఖలతో సమన్వయం చేసుకొంటూ ఎంఆర్‌డీసీఎల్ అధికారులు రూపొందించిన మ్యాప్ ప్రకారం.. హిమాయత్‌సాగర్ నుంచి వచ్చే అవుట్‌ఫ్లో, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నుంచి వచ్చే అవుట్‌ఫ్లో వేర్వేరుగా ప్రవాహ మార్గాల్లో వచ్చి లంగర్‌హౌస్ సమీపంలో ఒకే మార్గంగా కలుస్తాయి. అక్కడినుంచి మూసీ నది నల్లగొండ జిల్లాలోనూ ప్రవహించి.. ఆపై కృష్ణా నదిలో కలుస్తుంది. ఉస్మాన్‌సాగర్ నుంచి లంగర్‌హౌస్ సమీపంలోని బాపూఘాట్ వరకు సుమారు 11.7 కిలోమీటర్ల మేర మూసీ ప్రవహిస్తుంది. అదేవిధంగా ఈసా నది హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు దాదాపు తొమ్మిది కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. ఆపై రెండూ కలిసే ప్రవహించే మార్గంలో సుమారు 45 కిలోమీటర్ల వరకు అంటే గౌరెల్లి వరకు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు మ్యాప్‌ను రూపొందించారు.

### భయపెడుతున్న బఫర్‌జోన్

ఎంఆర్‌డీసీఎల్ అధికారులు రూపొందించిన మ్యాప్‌లో రెండు నదుల ప్రవాహ మార్గం అవుటర్ రింగు రోడ్డు వరకు దాదాపు 54 కిలోమీటర్ల మేర ఉన్నది. మూసీ రివర్ బెడ్‌ను అధికారులు రెడ్ మార్క్‌తో గుర్తించారు. అందుకే ఇటీవల కూల్చివేసిన ఇండ్లతోపాటు ఇప్పటికే వేలాది ఇండ్లపై రెడ్ మార్కుగా ఆర్‌బీ-ఎక్స్ (రివర్ బెడ్)ను ముద్రించారు. ఈ రెడ్ మార్కును పరిశీలిస్తే, రంగారెడ్డి-హైదరాబాద్-మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో గరిష్ఠంగా ఐదు వేల నిర్మాణాల వరకు వస్తాయని ప్రాథమిక అంచనా. రివర్ బెడ్‌లో ఉన్న ఈ నిర్మాణాల కూల్చివేత ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. మ్యాప్‌లో సూచించిన మరో బ్లూ మార్క్ ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫుల్ రివర్ లెవల్) అంటే గరిష్ఠ నదీ ప్రవాహాన్ని సూచిస్తుంది. దీని పరిధిలోని నిర్మాణాలను చూస్తుంటే 'అమ్మో... ఇన్ని నిర్మాణాలను తొలగించాలా?' అనే భావన కలుగుతుంది. ఎఫ్‌ఆర్‌ఎల్ నుంచి నిబంధనల ప్రకారం బఫర్‌జోన్ 30 మీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుతానికి అధికారులు మ్యాప్‌లో బఫర్‌జోన్‌ను గుర్తించలేదు. దీనిని కూడా గుర్తిస్తే ఎన్ని వేల నిర్మాణాలను తొలగించాల్సి వస్తుందో అంతుబట్టడం లేదు. సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నదీ మార్గం వెంట పెద్ద ఎత్తున రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో మార్గాలు, ఆకాశహర్మ్యాలు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఈ లెక్కన మున్ముందు బఫర్‌జోన్‌ను కూడా స్వాధీనం చేసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే 54 కిలోమీటర్ల మేరలో లక్షన్నర వరకు నిర్మాణాలు ఉండొచ్చని మూసీపై అధ్యయనం చేస్తున్న నిపుణుడు ఒకరు అభిప్రాయపడ్డారు. అధికారులు మాత్రం ప్రస్తుతం రివర్‌బెడ్‌కు మాత్రమే పరిమితం అవుతున్నామని చెప్తున్నారు. మున్ముందు రేవంత్ సర్కారు అడుగులు ఎలా ఉంటాయనేది ఎవరికీ అంతుబట్టడం లేదు. ఇందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతంలో చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. ఎందుకంటే ఆయన గతంలో పలు మీడియా ఇంటర్వ్యూల్లో మాట్లాడుతూ... తొలుత కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తామని, ఆపై బఫర్‌జోన్‌కు వెళ్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు హైడ్రా చేపట్టిన కూల్చివేతల్లో ఎఫ్‌టీఎల్‌తోపాటు బఫర్‌జోన్ నిర్మాణాలు కూడా ఉన్నాయి. ఒక్కసారి బుల్డోజర్‌కు మార్గం సుగమం అయిందంటే రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అనే తేడా ఉండదనేది హైడ్రా కూల్చివేతలతోనే స్పష్టమైంది. అందుకే అసలు మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో ఎన్ని నిర్మాణాలను సేకరిస్తారు? ఎన్ని మీటర్ల మేర సుందరీకరణ చేపడతారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని మూసీపై అధ్యయనం చేస్తున్న నిపుణులు డిమాండు చేస్తున్నారు.



### హుడా అనుమతులున్నా... రెడ్ మార్కులోనే!

మూసీ రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాలు అక్రమమంటూ ప్రభుత్వం వాటిని నేలమట్టం చేస్తున్నది. ఇప్పటివరకు కూల్చివేసిన 150 నిర్మాణాలకు పెద్దగా అనుమతులు లేవని తెలిసింది. దీంతో ప్రభుత్వం వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని, వారిలో కొందరిని ఒప్పించి ఇండ్లను కూల్చివేసింది. కానీ, హైదర్‌షాకోట్, అత్తాపూర్, దిగువన ఉన్న నాగోల్ పరిసర ప్రాంతాల్లోని వేలాది నిర్మాణాలకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయి. దశాబ్దాలుగా వారంతా ఆస్తిపన్ను, నీటి బిల్లు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. అంతేకాదు, లంగర్‌హౌస్ పరిసర ప్రాంతంలో ఏకంగా హుడా లేఅవుట్‌లో దశాబ్దాల క్రితం చేపట్టిన నిర్మాణాలకు సైతం రెడ్‌మార్కు వేశారు. అంటే గతంలో అనుమతులు ఉన్నవే రివర్‌బెడ్‌లో ఉంటే, దాని అవతల ఉండే ఎఫ్‌ఆర్‌ఎల్, బఫర్‌జోన్ పరిస్థితి ఏమిటనేది అంతుబట్టడం లేదు.

# 6 వేల కోట్ల భూమి కోసమేనా!


- అదానీ, పొంగులేటి భేటీ దీనికోసమేనా?
- రాయదుర్గం గుట్టపై 64 ఎకరాల భూమి
- ఈ భూమిపై గౌతం అదానీ కన్ను
- చక్రం తిప్పిన ఏపీ మాజీ సీఎస్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న అత్యంత ఖరీదైన స్థలాన్ని అదానీకి కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతున్నదా? అంటే.. ఔననే సమాధానం వినిపిస్తున్నది. బీజేపీతో సత్సంబంధాలున్న అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ బుధవారం హైదరాబాద్ రావడం, ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్ నంబర్ 2122లో గంటకుపైగా మంత్రి పొంగులేటితో రహస్యంగా సమావేశం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా ఉన్నట్టు తెలిసింది. అదానీతో భేటీపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, అటు అదానీ కంపెనీగానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఈ భేటీపై అనేక ఊహాగానాలు బయటకు వచ్చాయి. దుర్గంచెరువు సమీపంలోని రాయదుర్గం గుట్టపై అత్యంత ఖరీదైన 64 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంపై మంత్రి పొంగులేటిని అదానీ కలిసినట్టు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీ (మాజీ ఎమ్మెల్యే కూడా)కి చెందిన సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ భూమిని తన ఖాతాలో వేసుకున్నట్టు సమాచారం. ఈ విషయంలో కొంత వివాదం ఉండడంతో తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దీనిని ప్రభుత్వ భూమిగా పేర్కొన్నాయి. అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్, కలెక్టర్లు దీనిపై విచారణ జరిపి దానిని ప్రభుత్వ భూమిగా తేల్చి నాటి ఏపీఐఐసీ పరిధిలోకి తెచ్చారు. అయితే, ఆ తర్వాత ఆ మాజీ ఎంపీ తన పలుకుబడి ఉపయోగించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా పదవీవిరమణ చేసిన ఓ అధికారి సాయంతో మళ్లీ తమ పరిధిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. ఆ అధికారి గతంలో హెచ్‌ఎండీఏలో కూడా పనిచేయడంతో తన పలుకుబడిని ఉపయోగించి ఈ భూమిని అదానీ కోసం మాట్లాడిపెట్టినట్టు చెప్తున్నారు. ఈ వివాదాస్పద భూమి ప్రస్తుత మార్కెట్ విలువ అక్షరాలా ఆరువేల కోట్లని చెప్తున్నారు. ఇంతటి విలువైన భూమిని తెలంగాణ ప్రభుత్వం నుంచి విడిపించి అదానీకి ఇప్పించేందుకు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. దీని కోసం పాత డాక్యుమెంట్లు, కేసులు, అప్పీళ్లు వంటివాటిని చూపించి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆ నేతకు అప్పగించి, అక్కడి నుంచి అదానీకి అప్పగించే కుట్ర జరుగుతున్నదని, ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు చాలా చురుగ్గా వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు. అదానీతో కలిసి ఈ భూములను తామే తీసుకునే ప్రయత్నంలో ఉన్నారా? లేక ఆంధ్రప్రదేశ్‌లో తాను పనిచేసిన పాత పార్టీకి చెందిన ఆ మాజీ ఎంపీ కోసం పైరవీ చేస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో ప్రభుత్వం మారినప్పటి నుంచి ఈ భూమికి సంబంధించిన మంతనాలు జరుగుతున్నాయని చెప్తున్నారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో ఈ స్థలాన్ని విడిపించి ఇచ్చే ప్రక్రియ జోరుగా జరుగుతున్నదని మాత్రం చెప్తున్నారు.


### అపాయింట్‌మెంట్లు క్యాన్సిల్!

అదానీ వాస్తవానికి గురువారం ముఖ్యమంత్రి, ఇతరులతో కూడా సమావేశం కావాల్సి ఉందని తెలిసింది. దావోస్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణలో వ్యాపారం నిర్వహించేందుకు అదానీ ఆసక్తి చూపిన విషయం తెలిసిందే. ఈమేరకు ఒప్పందం కూడా చేసుకున్నారు. దావోస్ ఒప్పందం తర్వాత అదానీ హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారి. పొంగులేటితో భేటీ మీడియాలో ముందే రావడంతో కొంత వెనుకడుగు వేసినట్టు చర్చ జరుగుతున్నది. సీఎంతో మాట్లాడేందుకు తొలుత అపాయింట్ ఖరారు అయినప్పటికీ కలువకుండానే వెళ్లిపోయినట్టు చెప్తున్నారు.

## లోకం పోకడ




స్పెషల్ బస్సులు సరేగానీ, స్పెషల్ బుల్డోజర్లు మాత్రం పంపకండి సారూ!



# అనర్హత పిటిషన్లపై తీర్పును రద్దు చేయండి

### హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లు

### ప్రతివాదులకు నోటీసులిచ్చిన న్యాయస్థానం

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గత నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేయాలని కోరుతూ అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ముందు ఉంచాలని, నాలుగు వారాల వ్యవధిలో విచారణ షెడ్యూల్‌ను ప్రకటించాలని హైకోర్టు అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. ఆ వివరాలను కోర్టు రిజిస్ట్రీకి అందజేయాలని స్పష్టంచేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు వేర్వేరుగా రెండు అప్పీళ్లు దాఖలు చేశారు.

### ఊహాజనిత ఆరోపణలతో పిటిషన్లు

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోలేదంటూ ఊహాజనిత అంశాలతో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద, మహేశ్వర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారని అసెంబ్లీ కార్యదర్శి తన అప్పీలులో పేర్కొన్నారు. వారిచ్చిన పిటిషన్లపై నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా కోర్టుకు వచ్చారని తెలిపారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం స్పీకర్ ఓ విధానం ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని వివరించారు. తమ వాదనలను పరిగణలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అప్పీళ్లపై విచారణ పూర్తయ్యేదాకా సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేయాలని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రస్తుత అప్పీళ్లలో నిర్ణీత కాల వ్యవధిలో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించే పరిధి ఈ కోర్టుకు ఉందా? లేదా అన్నది తేల్చాల్సి ఉన్నదని పేర్కొంది. దీనిపై ఈ నెల 24న తుది విచారణ చేపడతామని, ఈలోగా ఏవైనా చర్యలు తీసుకుంటున్నట్టయితే కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. ఇందులో ప్రతివాదులైన పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఏ మహేశ్వర్‌రెడ్డితోపాటు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 24కు వాయిదా వేసింది.

### కమిషన్‌దే అంతిమ నిర్ణయం

గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అంతిమ నిర్ణయం కమిషన్‌దేనని టీజీపీఎస్సీ గురువారం హైకోర్టుకు నివేదించింది. నోటిఫికేషన్ రద్దు, కొత్త నోటిఫికేషన్ జారీ, రిజర్వేషన్ల కల్పనలకు సంబంధించి కమిషన్ తీసుకున్న నిర్ణయాలే అంతిమమని పేర్కొంది. గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీచేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీచేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. టీజీపీఎస్సీ తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపించారు. త్వరలో మెయిన్ పరీక్షలు జరగనున్నందున ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వాదనలు పూర్తికాకపోవడంతో న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

### కూలీలకు ఇచ్చిన కూల్చివేత నోటీసుల రద్దు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేట హరిజనబస్తీ వాసులకు తహసీల్దార్ జారీచేసిన కూల్చివేత నోటీసులను హైకోర్టు రద్దు చేసింది. పూర్తి వివరాలతో, బస్తీవాసుల వాదన విని చట్టప్రకారం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలున్నాయని, వాటిని తొలగించాలంటూ ఆగస్టు 21న తహసీల్దార్ జారీచేసిన నోటీసులను రద్దుచేయాలని, కూల్చివేతలు చేపట్టకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలంటూ హస్మత్‌పేట హరిజనబస్తీకి చెందిన మల్లయ్య మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీ టిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. తహసిసీల్దార్ జారీచేసిన నోటీసులను రద్దు చేస్తూ, చట్ట నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టవచ్చంటూ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

## 6 నుంచి కాలేజీలకు దసరా సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఇంటర్‌బోర్డు దసరా సెలవులను ప్రకటించింది. ఈ నెల 6 నుంచి 13 వరకు సెలవులిచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కాలేజీలు, గురుకులాలు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లు అన్ని ఈ సెలవులను పాటించాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. సెలవులు ముగిసిన తర్వాత ఈ నెల 14నుంచి కాలేజీలు పునఃప్రారంభమవుతాయన్నారు.

# చింతలపల్లి కార్యదర్శికి మెమో

### పెద్దంపల్లిలో విద్యుత్తు లైట్ల ఏర్పాటు

### 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

ములుగు, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)/టేకుమట్ల: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పెద్దాపురం గ్రామపంచాయతీ పరిధి చింతలపల్లి గ్రామ కార్యదర్శికి కలెక్టర్ రాహుల్‌శర్మ మెమో జారీ చేశారు. గ్రామంలో మహిళలంతా బుధవారం ఎంగిలి పూల బతుకమ్మను చీకట్లో ఆడగా 'నమస్తేతెలంగాణ' మెయిన్‌లో 'చీకట్లోనే బతుకమ్మ సంబురాలు' శీర్షికన గురువారం కథనాన్ని ప్రచురించింది. చింతలపల్లి గ్రామం ములుగు నియోజకవర్గ పరిధిలో ఉన్నా.. జిల్లా పరంగా భూపాలపల్లి జిల్లాలోకి వస్తుంది. ఈ విషయంపై ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆరా తీశారు. గ్రామ కార్యదర్శి కవితకు గురువారం మెమో జారీ చేశారు. పెద్దంపల్లిలో బతుకమ్మ ఆడే స్థలం వద్ద అధికారులు విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

# కిరాయి పేదల హడావుడి అది

▸ మొదటిపేజీ తరువాయి...

మనుషులను ఎగదోసి ఆగమాగం చేస్తున్నారని ఆరోపించారు. 'డ్రైనేజీ నీళ్లు హైదరాబాద్ నగరం తాగాలా? ముసుగు తొడుక్కునేందుకు మూసీ కావాల్సి వచ్చిందా? మూసీని అడ్డం పెట్టుకుని ఎంతకాలం బతుకుతారు. నెల రోజులులైనా మిమ్మల్ని వదల.. మీ భరతం పడతా.. ఒక్కొక్కరిని చింతపండు చేస్తా' అంటూ సీఎం ఆగ్రహంతో ఊగిపోయారు. సికింద్రాబాద్ సిక్ విలేజీలోని హాకీ గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన కుటుంబ గుర్తింపు, కుటుంబ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 119 నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా దీనిని చేపట్టామని, ఒక్క క్లిక్‌తో 30 శాఖల సమాచారం ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులో వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. 'వన్ స్టేట్ వన్ కార్డు' విధానంతో సంక్షేమ పథకాలతోపాటు హెల్త్ ప్రొఫైల్‌ను పొందుపరుస్తామని తెలిపారు. పేదలకు ఇండ్లు కట్టించేందుకు, నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ప్రతిపక్షాలు కలిసిరావాలని చెప్పారు. నగరానికి మంచి భవిష్యత్తును అందించేందుకు చెరువులు, నాళాలు, మూసీ ఆక్రమణలు తొలగించాల్సిందేనని ఉద్ఘాటించారు.

### బురద జల్లుకుంటూ తిరుగుతున్నరు

'ఏది పడితే అది వాగుడు.. అడ్డగోలుగా తప్పులు.. విపరీతంగా అప్పులు.. దాంతో రాష్ట్రం నిండా మునిగింది. ఇవాళ మేం సరిదిద్దుతామని చేస్తుంటే అడ్డం పడుతున్నరు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడాలని తాము ముందుకు పోతుంటే దాని మీద కూడా బురద జల్లుకుంటూ బావ, బామ్మర్దులు తిరుగుతున్నారని, కిరాయి మనుషులతో హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చి, రూ.25 వేలు ఇస్తుంటే అభినందించాల్సి పోయి అన్యాయంగా మాట్లాడుతున్నారని తెలిపారు.

### కేవీపీ ఫాంహౌస్‌ను కూల్చాలా వద్దా?

హైదరాబాద్ నగరాన్ని కాపాడాలనే ఉద్దేశంతో హైడ్రా, మూసీ ప్రాజెక్టులను తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ ప్రాంత పేదలకు ప్రత్యామ్నాయం ఏం చేయాలో చెప్పాలని, వినడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రతిపక్ష పార్టీల నేతలను కోరారు. అక్రమంగా నిర్మించుకున్న ఫాంహౌస్‌లను ఎక్కడ కూల్చివేస్తరోనని కేటీఆర్, హరీశ్‌రావు, సబితమ్మ పేద ఏడ్పులు ఏడుస్తున్నారని, కేవీపీ అక్రమంగా నిర్మించిన ఫామ్‌హౌస్‌ను కూ ల్చాలా వద్దా? అంటూ ప్రశ్నించారు.

### ఈటలా.. మోదీ దగ్గరకెళ్దాం

మూసీ పరిధిలోని పేదలకు న్యాయం చేసేందుకు ఇద్దరం కలిసి మోదీ వద్దకు వెళ్దాం.. పాతిక వేల కోట్లు తీసుకొద్దాంరా.. అంటూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూసీ కూల్చివేతలపై ఈటల అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

### రేవంత్‌రెడ్డి ఆరాచక శక్తి: ఈటల

సీఎం రేవంత్‌రెడ్డి.. చట్టం, సిస్టం లేని ఓ అరాచక శక్తి అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌పై ఆయన ఘాటుగా స్పందించారు. 'నీకు దమ్ముంటే ఇద్దరం వితౌట్ సెక్యూరిటీతో మూసీ పరీవాహక ప్రాంతంలో కూలగొట్టబోతున్న ఇండ్ల వద్దకు వెళ్దాం. 'శభాష్ రేవంత్‌రెడ్డి' అని ఒక్కరు అన్నా నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా. లేదంటే బహిరంగంగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తావా' అంటూ ప్రతిసవాల్ విసిరారు.

# రాష్ట్ర ప్రభుత్వమే కూలుతుంది!

### హామీలు అమలు చేయలేక హైడ్రా పేరిట డ్రామాలు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్3 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూలిస్తే రాష్ట్ర ప్రభుత్వమే కూలుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్తీల్లోని పేదల బతుకులను కాంగ్రెస్ ప్రభుత్వం ఛిద్రం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తున్నదని ఆరోపించారు. దేశంలో ఎక్కడా, ఏ ప్రభుత్వమూ ఇలా పేదల ఇండ్లను కూల్చలేదని తెలిపారు. ముందు పెద్దలు నిర్మించిన ఎస్టేట్ కంపెనీలు, ఫాంహౌజ్‌లు, ఒవైసీ ఫాతిమా కాలేజీని కూల్చాలని సవాల్ విసిరారు. మంత్రి సురేఖ వ్యాఖ్యలు గర్హనీయమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతర మహిళల వ్యక్తిగత విషయాలను రాజకీయాల్లోకి తీసుకురావడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు.